క్లుప్తంగా

అమ్మవార్ల జాతరకు ఆహ్వానం



వంశీకృష్ణకు ఆహ్వాన పత్రిక అందిస్తున్న సభ్యులు

బీచ్‌రోడ్డు: ఇసుకతోటలో కొలువుదీరిన కనక దుర్గమాంబ, నెల్లి పోలమాంబ, ఎర్నిమాంబ వార్షిక జాతరకు హాజరు కావాలంటూ ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్‌ను శ్రీకృష్ణ ఉమామహేశ్వర సాయి దుర్గ యాదవ సేవా సంఘం ప్రతినిధులు ఆహ్వానించారు. ఈ మేరకు వంశీకృష్ణను తన నివాసంలో శుక్రవారం కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు జరగనున్న ఈ మహోత్సవంలో పాల్గొనాలని కోరారు.

ఫ్రైడే డ్రైడేపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న జెడ్సీ శివప్రసాద్, కార్పొరేటర్ పల్లా అప్పలకొండ, తదితరులు

బీచ్ రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డులో శుక్రవారం జోనల్ కమిషనర్ శివప్రసాద్ ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రైడేపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పల్లా అప్పలకొండ మాట్లాడుతూ దోమలు వృద్ధి చెందకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించి వ్యాధులు దగ్గరకు రాకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలతో సముద్ర జీవరాశులకు ప్రమాదం



తీరంలోని వ్యర్థాలను తొలగిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

బీచ్ రోడ్డు: తీరంలో ప్లాస్టిక్ వ్యర్థాలు వేయడం వల్ల సముద్ర జీవరాశులకు పెను ప్రమాదం సంభవిస్తుందని వడ్లమూడి ఫౌండేషన్ అధ్యక్షుడు పొందు రంగారావు అన్నారు. శుక్రవారం వడ్లమూడి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బీచ్ క్లీనింగ్ కార్యక్రమం చేపట్టారు. తీరంలో ప్లాస్టిక్ వ్యర్థాల ద్వారా కలిగే నష్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు సాంబమూర్తి, బోస్, తదితరులు పాల్గొన్నారు.

డ్రాయింగ్ పోటీలు రేపు

బీచ్ రోడ్డు: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం డ్రాయింగ్ పోటీలు నిర్వహించనున్నట్టు యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ విశాఖ బ్రాంచి అధ్యక్షుడు పుండరికాక్ష ఒక ప్రకటనలో తెలిపారు. 8 నుంచి 15 ఏళ్ల వయస్సు మధ్య గల పిల్లలు ఈ పోటీల్లో పాల్గొనవచ్చునని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు శనివారం సాయంత్రంలోపు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం 99492 32380 నంబరుకు ఫోన్ చేసి సంప్రదించాలన్నారు.

తక్షణమే దహన ఖర్చులు చెల్లించండి

అల్లిపురం: జీవీఎంసీ రెగ్యులర్ ఉద్యోగులు ఎవరైనా మరణిస్తే వారి కుటుంబ సభ్యులకు తక్షణమే దహన ఖర్చుల నిమిత్తం రూ.25లు చెల్లించేలా జీవీఎంసీ కమిషనర్ సీహెచ్ సాయికాంత్ వర్మ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు జీవీఎంసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వీవీ రామారావు, ప్రధాన కార్యదర్శి నరసింగరావు శుక్రవారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. గతంలో ఉద్యోగి చనిపోయి సంవత్సరం గడిచిపోయినా దహన ఖర్చులు అందక వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులుకు గురయ్యేవారన్నారు. ఈ విషయాన్ని కమిషనర్ సాయికాంత్‌వర్మ దృష్టికి యూనియన్ నాయకులు తీసుకురావటంతో, తక్షణమే స్పందించిన ఆయన హెచ్‌వోడీలకు లక్ష రూపాయలు చొప్పున అడ్వాన్స్ మంజూరు చేస్తూ ఆదేశాలు ఇచ్చారన్నారు.

ఎట్టకేలకు యూజీడీ సిద్ధం.!

- పెదజాలరిపేటలో దాదాపు పూర్తయిన పనులు
- రీసైక్లింగ్ పంప్‌హౌస్ పనులు చేపట్టిన అధికారులు



యూజీడీ కనెక్షన్ ఇవ్వకపోవడంతో రోడ్డుపైకి చేరుతున్న వ్యర్థనీరు



జాలరిపేటలో పూర్తయిన యూజీడీ నిర్మాణం



యూజీడీ కనెక్షన్లు ఇవ్వని పైపులైన్‌లు



నిర్మాణంలో ఉన్న తీరంలోని రీసైక్లింగ్ పంపుహౌస్

ఎంవీపీ కాలనీ: పెదజాలరిపేట వాసులకు త్వరలో యూజీడీ(అండర్ గ్రౌండ్ డ్రైనేజీ) వ్యవస్థ అందుబాటులోకి రానుంది. నగరంలోని అనేక ప్రాంతాల్లో యూజీడీ నిర్మాణం జరిగి ఏళ్లు గడుస్తున్నా పెదజాలరిపేట వాసులకు ఆ సేవలు నేటికి అందలేదు. దీంతో కాలనీ మొత్తం ఒకేసారి యూజీడీ సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు 2018లో జీవీఎంసీ ప్రణాళికలు సిద్ధం చేసింది. స్మార్ట్ సిటీ పనుల్లో భాగంగా రూ.35 కోట్లతో ఈ పనులకు శ్రీకారం చుట్టింది. తొలుత పనుల్లో కొంత జాప్యం జరిగినప్పటికీ, తరువాత వేగం పెంచి జీవీఎంసీ ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును దాదాపు పూర్తి చేసింది. రీసైక్లింగ్ పంప్‌హౌస్ 2వ దఫా పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ పనులు పూర్తయితే జాలరిపేట వాసులకు యూజీడీ సేవలు అందుబాటులోకి రావడంతో పాటు మురుగునీటి పాట్లు తప్పనున్నాయి.

రూ.35 కోట్లుతో పనులు:

జీవీఎంసీ రూ.35 కోట్లుతో చేపట్టిన ఈ ప్రాజెక్టు ద్వారా 9 కిలోమీటర్ల పరిధిలో అన్ని వీధుల్లోను యూజీడీ నిర్మించింది. 8 వేల నుంచి 10 వేల జనాభా కలిగిన ఉన్న ఈ ప్రాంతంలో 5 వేల ఇళ్ల వరకు యూజీడీ కనెక్షన్ పరిధిలోకి రానున్నాయి. తొలుత 2020 నాటికి ఈ పనులు పూర్తిచేయాలని జీవీఎంసీ లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ కోవిడ్ కారణంగా పనుల్లో జాప్యం జరిగింది. అయితే ఇప్పటికే అనేక గృహాలకు కనెక్షన్‌లు ఇచ్చే ప్రక్రియ పూర్తి కాగా.. మరికొన్నింటికి ఇంకా ఇవ్వాల్సి ఉంది. యూజీడీ నిర్మాణం కారణంగా జరిపిన తవ్వకాలు, పలు ఇళ్లకు కనెక్షన్లు కలపకపోవడం వల్ల కొన్ని చోట్ల వ్యర్థ నీరు రోడ్లపైకి చేరుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యూజీడీ వ్యవస్థ పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే తప్ప ఆయా సమస్యలకు పరిష్కారం లభించదని అభిప్రాయపడుతున్నారు. దీంతో పాటు మిగతా ఇళ్లకు కూడా యూజీడీ కనెక్షన్లను త్వరితగతిన ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రెండు వారాల్లో అందుబాటులోకి..

యూజీడీ నిర్మాణం పెదజాలరిపేటలోని అన్ని వీధుల్లో ఇప్పటికే పూర్తయింది. ఇళ్ల ద్వారా యూజీడీ డ్రైన్‌లో చేరిన వ్యర్థ నీటిని శుద్ధి చేసి సముద్రంలోకి విడుదల చేయాల్సి ఉంటుంది. ఇందుకు అనుగుణంగా తీరంలో రీసైక్లింగ్ పంప్ హౌస్‌ను నిర్మిస్తున్నాం. ఈ పంప్‌హౌస్ పనులు ఇంకా పూర్తికాకపోవడంతో యూజీసీ సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదు. ఈ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఇటీవల ఆదేశించాం. ఈ నేపథ్యంలో పంప్‌హౌస్ 2వ దఫా పనులు ప్రస్తుతం ప్రారంభించాం. త్వరితగతిన ఈ పనులు పూర్తిచేసి యూజీడీ పైప్‌లైన్లను ఈ పంపుహౌస్‌లోని ఇన్‌స్పెక్షన్ ఛాంబర్‌కు కనెక్ట్ చేయాల్సి ఉంటుంది. ఆయా పనులను త్వరితగతిన పూర్తి చేసి రెండు వారాల్లో యూజీడీ సేవలను అందుబాటులోకి తేస్తాం.

– దిలీప్, జీవీఎంసీ డీఈ

ఆలోచింపజేసిన సాంఘిక నాటికలు



సావిత్రి సవాల్ నాటికలో సన్నివేశం

మద్దిలపాలెం: సమాజంలో చోటు చేసుకుంటున్న యదార్థ ఘటనలకు సాక్షి భూతంగా ప్రదర్శించిన సాంఘిక నాటికలు అందరి హృదయాలను కదిలించాయి. విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ నెలవారీ కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో సావిత్రి సవాల్, ఆఖరి ఉత్తరం నాటికలను ప్రదర్శించారు. ముందుగా రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి డి.ఎస్.ఎన్.మూర్తి ముఖ్యఅతిథిగా జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం విజయనగరానికి చెందిన నాటక శాల నటసేవా సమాజం వారితో గెద్ద వరప్రసాద్ దర్శకత్వంలో ద్విభాష్యం రాజేశ్వరరావు రచించిన సావిత్రి సవాల్ నాటికను ప్రదర్శించారు. సావిత్రి, సత్యవంతుడు భార్యభర్తలు. తన భర్త ప్రాణాలను యముడిని ఎదిరించి కాపాడానని గర్వంతో ఆమె భర్తను వేధిస్తుంటుంది. ఆయన ఈ బాధలు భరించలేక నరకమే నయమనే ఇతివృత్తంతో సాగే ఈ నాటికను నటీనటులు చక్కని అభినయంతో మెప్పించారు. అనంతరం చెరుకూరి సాంబశివరావు రచించగా, గెద్ద వరప్రసాద్ దర్శకత్వం వహించిన ఆఖరి ఉత్తరం నాటిక ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. పిల్లలను పెద్ద చదువుల చదివిస్తే అండగా ఉంటారని కలలు కనే తల్లిదండ్రులకు ఎదురైన దుస్థితిని కళ్లకట్టినట్టుగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో వీఎండీఏ అధ్యక్షుడు ఎం.ఎస్.ఎన్.రాజు, జగత్‌రాయ్, తదితరులు పాల్గొన్నారు.

అనధికారిక నిర్మాణాల తొలగింపు



చినగదిలిలో జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ సిబ్బంది తొలగించిన అనధికారిక నిర్మాణం

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డులో జరుగుతున్న అనధికారిక నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ అధికారులు కన్నెర్ర చేశారు. చినగదిలి ప్రాంతంలో రెండు చోట్ల అనధికారిక అంతస్తులు నిర్మించినట్లు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మకు ఇటీవల ఫిర్యాదులు అందాయి. ఈ మేరకు ఆయన ఆదేశాలతో టౌన్ ప్లానింగ్ సిబ్బంది శుక్రవారం ఆయా నిర్మాణాల వద్దకు వెళ్లి శ్లాబ్‌లను కూల్చివేశారు. ఆరిలోవ ప్రాంతంలో కూడా పలుచోట్ల అనధికారిక నిర్మాణాలు జరుగుతున్నట్లు సమాచారం వచ్చిందని, వాటిని పరిశీలించి చర్యలు చేపడతామని టౌన్ ప్లానింగ్ అధికారులు తెలిపారు.

జన శిక్షణా సంస్థాన్‌లో 'జన్ భాగీదరి'



జన్ భాగీదరి అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న జన శిక్షణా సంస్థాన్ సభ్యులు

మద్దిలపాలెం : కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పితాపురం కాలనీలోని జన శిక్షణా సంస్థాన్ ఆధ్వర్యంలో శుక్రవారం జన భాగీదరి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జన శిక్షణా సంస్థాన్ డైరెక్టర్ సిహెచ్.అప్పలనాయుడు మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని ఈ నెల 15వ తేదీ వరకు జీ–20 కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తామన్నారు. రంగోలి, క్విజ్, మొక్కల నాటడం వంటి కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు. వెబ్‌నార్ ద్వారా కెపాసిటీ బిల్డింగ్ కార్యక్రమం నిర్వహించనున్నామని తెలిపారు.

సాంకేతిక విజ్ఞాన కేంద్రం ప్రారంభం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పరిశ్రమల నిపుణులు

కొమ్మాది: స్థానిక పరిశ్రమలు, విద్యాలయాలకు మధ్య సంబంధాలను బలోపేతం చేయడంతో పాటు నూతన సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధికి గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక విభాగం (డీఎస్‌టీ) ఏర్పాటు చేసిన సాంకేతిక విజ్ఞాన కేంద్రం (జి–టెక్)ను శుక్రవారం విశాఖ ఉక్కు కర్మాగారం చైర్మన్ అతుల్‌భట్ ప్రారంభించారు.

ఉక్కు పరిశ్రమ రంగంలో డిజిటలైజేషన్, ఆటోమేషన్లకు ఇతర దేశాలపై ప్రధానంగా ఆధారపడుతున్నామని, ఈ పరిస్థితి మారి స్వదేశీ పరిజ్ఞానం అభివృద్ధి చేసుకోవాన్నారు. ఈ కార్యక్రమంలో గీతం అధ్యక్షుడు ఎం. శ్రీ భరత్, వీసీ ప్రొఫెసర్ దయానంద సిద్దవటం, డీఎస్‌టీ శాస్త్రవేత్త డాక్టర్ పి. కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ మేళాకు విశేష స్పందన

ఎంవీపీ కాలనీ: జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీలోని సమతా డిగ్రీ కళాశాల ఆవరణలో శుక్రవారం నిర్వహించిన ఉద్యోగ మేళాకు విశేష స్పందన లభించింది. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ అర్హతతో విద్యార్థులకు 11 కంపెనీలు ఉద్యోగావకాశాలు కల్పించాయి. ఐఏఎం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.సూర్యతేజ ముఖ్యఅతిథిగా పాల్గొని ఈ జాబ్‌మేళాను ప్రారంభించారు. 800 మంది వరకు ఈ మేళాకు నిరుద్యోగులు హాజరయ్యారు. ఉద్యోగాలు పొందిన వారికి నియామక పత్రాలు అందజేశారు. నెలకు రూ.10 వేలు నుంచి రూ.30 వేలు జీతంతో నిరుద్యోగులు ఉపాధి పొందారని నిర్వాహకులు తెలిపారు.

పోలీసుల అదుపులో దత్తపవర్

సీతమ్మధార: మహారాష్ట్ర నుంచి ఒడిశాకు పిస్టల్‌ను తరలించేందుకు సహకరించిన దత్తపవర్‌ను ఫోర్త్ టౌన్ పోలీసులు మహారాష్ట్ర నుంచి నగరానికి శుక్రవారం తీసుకొచ్చారు. శ్రీధర్ హరికిషన్ పతాంగికి పిస్టల్ ఇచ్చి పంపిచవలసిన అవసరం ఏంటని విచారణ చేపట్టారు. ప్రస్తుతం సీసీఎస్ పోలీస్ స్టేషన్‌లో పిస్టల్ ఇచ్చిన వ్యక్తిని పూరిలో ఉన్న వ్యక్తి ఎవరు..? అన్న కోణంలో పోలీసులు విచారిస్తున్నారు.

జాయింట్ ఆప్షన్ ఫారాలు ఆన్‌లైన్‌లో పంపించాలి

మురళీనగర్(విశాఖ ఉత్తర): హయ్యర్ వేజ్ పింఛన్ కోసం సభ్యులు, పెన్షనర్లు జాయింట్ ఆప్షన్ ఫారాలు ఆన్‌లైన్‌లో పంపించుకోవాలని రీజినల్ పీఎఫ్ కమిషనర్–2 పవన్‌కుమార్ జాస్తి ఒక ప్రకటనలో తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ఈపీఎఫ్ ప్రధాన కార్యాలయం న్యూఢిల్లీ నుంచి వచ్చిన సర్క్యులర్‌ను అనుసరించి ఎంప్లాయిస్ పెన్షన్ స్కీమ్ 1995 సంబంధించిన పింఛన్‌దారులు అధిక పింఛన్ కోసం యాజమాన్యంతో కలిపి జాయింట్ ఆప్షన్ ఫారాలను ఆన్‌లైన్‌లో మాత్రమే పంపించాల్సి ఉంటుందన్నారు. https:// unified portal& mem. epfindia. gov. in వెబ్‌సైట్‌లో ఫారాలు పంపించుకోవాల్సి ఉంటుందన్నారు.

ప్రశాంతంగా టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

విశాఖ విద్య: పదో తరగతి సప్లిమెంటరీ (అడ్వాన్స్‌డ్) పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు తెలుగు పరీక్ష జరిగింది. జిల్లాలోని 24 కేంద్రాల్లో తెలుగు పరీక్షకు 2,041 మంది విద్యార్థులు నమోదు చేసుకున్నారు. వీరిలో 1,708 మంది పరీక్షకు హాజరయ్యారు. 333 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు విద్యాశాఖాధికారులు తెలిపారు. పరీక్షల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా విద్యాశాఖాధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మాస్‌కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా స్క్వాడ్ బృందాలు జిల్లాలోని 14 సెంటర్లును తనిఖీ చేశాయి.

చైన్ స్నాచర్ అరెస్టు, రిమాండ్

సీతమ్మధార: ఫోర్త్ టౌన్ క్రైం పోలీస్ స్టేషన్ పరిధిలో చైన్ స్నాచింగ్ కేసులో ఓ యువకుడిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలిలా.. గురువారం రాత్రి అక్కయ్యపాలెం వెంకటేశ్వర కల్యాణ మండపంలో పెళ్లి జరిగింది. బంధువుల భోజనాల అనంతరం మండపం వద్ద ఒక యువకుడు రెక్కీ నిర్వహించాడు. పెళ్లికి వచ్చిన విజయనగరానికి చెందిన జయ కుటుంబ సభ్యులు రాత్రి 11 గంటల సమయంలో భోజనం చేసి కిందకు వచ్చారు. అక్కడే ఉన్న పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన పుట్టా సతీష్ ఒక్కసారిగా జయ మెడలో ఉన్న బంగారు గొలుసు స్నాచింగ్ చేశాడు. ఆమె ఒక చేతితో పట్టుకోవడంతో సగం బంగారు పట్టుకొని పారిపోయాడు. వెంటనే బాధితురాలు డయల్ 100కు కాల్ చేయడంతో శుక్రవారం సతీష్‌ను క్రైం పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు క్రైం ఎస్ఐ ఖగేశ్వరరావు చైన్ స్నాచర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు.

వరాహ స్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



భూమి పూజలో పాల్గొన్న చిన జీయర్‌స్వామి

సింహాచలం: పెందుర్తి వెంకటాద్రిపై వరాహస్వామి ఆలయ నిర్మాణానికి పాంచరాత్ర ఆగమశాస్త్ర పండితుడు త్రిదండి చిన జీయర్‌స్వామి శుక్రవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమాన్ని వెంకటాద్రి అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పాల్గొన్నారు. ఆలయ అర్చకుడు రామానుజమ్ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అనాథ శవానికి అంత్యక్రియలు



శ్మశానంలో అనాథ శవానికి అంత్యక్రియలు జరుపుతున్న సేవా స్ఫూర్తి సభ్యులు

ఆరిలోవ: స్థానిక రవీంద్రనగర్‌లో ఓ అనాథ శవానికి సేవా స్ఫూర్తి అసోసియేషన్ సభ్యులు అంత్యక్రియలు జరిపించి మానవత్వం చాటుకున్నారు. రవీంద్రనగర్ బస్ స్టాప్ వద్ద సుమారు 50 సంవత్సరాలు వయస్సు ఉన్న గుర్తు తెలియని వ్యక్తి అనారోగ్యంతో బాధపడుతూ యాచన చేస్తూ గడిపేవాడు. ఆయన ఆరోగ్యం మరింత క్షీణించడంతో కొద్ది రోజులుగా నడవలేని పరిస్థితికి చేరుకున్నాడు. శుక్రవారం ఉదయం ఆయన మృతి చెందాడు. దీంతో సేవా స్ఫూర్తి అసోసియేషన్ సభ్యులు ఆరిలోవ పోలీసులకు సమాచారం అందించారు. అనాథ శవం కావడంతో పోలీసుల సమక్షంలో సభ్యులే ఆ శవాన్ని అందుబాటులో ఉన్న శ్మశానవాటికకు తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఒమ్మి అప్పలరాజు, సభ్యులు ఇమంది లక్ష్మణ్, ఎస్.ఆనందరావు, ఐ.గోపాల్, సీహెచ్.పద్మాజీ, ఆర్.ఎల్లాజీ, ఒ.పోలిరాజు, ఎన్.శివ, ఎం.వాసు, ఒ.అనీల్ పాల్గొన్నారు.

నేడు, రేపు నీటి సరఫరా ఉండని ప్రాంతాలు

సీతంపేట: జీవీఎంసీ టీఎస్సార్ ప్రాంగణంలోని వాటర్ ట్యాంకును శుభ్రం చేస్తున్న కారణంగా శని, ఆదివారాల్లో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని జీవీఎంసీ పర్యవేక్షక ఇంజినీర్ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు జోన్–3 పరిధిలోని సీతంపేట, అక్కయ్యపాలెం లలితా నగర్, ఎన్జీజీవోస్ కాలనీ, చిన్నూరు, నరసింహనగర్, గణేష్‌నగర్, నక్కవానిపాలెం, క్రాంతినగర్, గాంధీనగర్, మద్దిలపాలెం, చైతన్యనగర్, వినాకయ నగర్, మంగాపురం కాలనీ, పితాపురం కాలనీ, శివాజీపాలెం, మద్దిలపాలెం, ఎంవీపీ 1 నుంచి 12 సెక్టార్లు, జాలరిపేట, వాసవానిపాలెం, ఆదర్శనగర్, పెదవాల్తేర్, చినవాల్తేర్, పాండురంగాపురం, రేసపువానిపాలెం, పీతలవానిపాలెం ప్రాంతాలు.. జోన్–5 పరిధిలోని శ్రీనివాసనగర్, నందగిరినగర్, నరసింహనగర్, రైల్వే న్యూకాలనీ, వెంకటేశ్వర కాలనీ, జ్ఞానాపురం, బాబూ కాలనీ, సిరుల వీధి, సెబాస్టియన్ కాలనీ, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ, సుబ్బలక్ష్మినగర్, తాటిచెట్లపాలెం, అబిద్‌నగర్, శ్రీనివాసనగర్, చెక్కుడురాయి బిల్డింగ్, దాడి రామ్మూర్తి కల్యాణ మండపం, చాకలిపేట, టీఎస్ఎన్ కాలనీ ప్రాంతాలను శనివారం ఉదయం 10 నుంచి ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట వరకు నీటి సరఫరా జరగదని, ప్రజలు గమనించాలని ఆయన కోరారు.

ఏయూ సమాచారం

పర్యావరణ దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఔషధ గుణాలు కలిగిన మొక్కలు నాటే కార్యక్రమం పోస్టర్‌ను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి శుక్రవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ నెల 5న పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వర్సిటీలో వేప, రావి, ఉసిరి, నేరేడు, కొబ్బరి, మామిడి, తదితర ప్రాణవాయువుని అధికంగా అందించే మొక్కలను నాటనున్నారు. వర్సిటీలోని ప్రధాన రహదారుల వెంబడి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం కళాశాలల ప్రిన్సిపాళ్లు ఆచార్య కె.శ్రీనివాసరావు, ఆచార్య జి.శశిభూషణరావు, విద్యా విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు, ఎంప్లాయిమెంట్ బ్యూరో చీఫ్ ఆచార్య పి.అర్జున్, పరిశోధకులు మోహన్‌బాబు, శ్రీకాంత్, వినోద్ మాత్యుస్, రాజ్‌కుమార్, కల్యాణ్, అంబేడ్కర్, తదితరులు పాల్గొన్నారు.

ఐఎస్‌డీటీ జర్నల్ విడుదల



జర్నల్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఇండియన్ సొసైటీ ఫర్ ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్(ఐఎస్‌టీడీ) విశాఖ ప్రాంతీయ కేంద్రం నూతనంగా ప్రారంభించిన ప్రత్యేక సంచిక ప్రగ్యను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి శుక్రవారం తన కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సంచికలో వివిధ ఆర్టికల్స్, ఇంటర్వ్యూలు, పుస్తక సమీక్షలు ప్రచురిస్తారు. అదే విధంగా పరిశ్రమల్లో నూతన విధానాలను దీనిలో చర్చిస్తారు. తొలి సంచికను వీసీ ప్రసాదరెడ్డికి విశాఖ ప్రాంతీయ కేంద్రం చైర్మన్ డాక్టర్ ఒ.ఆర్.ఎం.రావు బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఐఎస్‌టీడీ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్‌కు సైతం ప్రత్యేక సంచికను బహూకరించారు. విశాఖ ఐఎస్‌టీడీలో 600 మందికిపైగా సభ్యులు ఉన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు టోపీల పంపిణీ



పారిశుద్ధ్య కార్మికులకు టోపీలు అందిస్తున్న కార్పొరేటర్ రోహిణి

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డులో పారిశుద్ధ్య కార్మికులకు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి టోపీలు అందజేశారు. వేసవి ఎండ నుంచి ఉపశమనం కోసం పారిశుద్ధ్య కార్మికులకు జీవీఎంసీ టోపీలు పంపిణీ చేసింది. వాటిని శుక్రవారం కార్మికులకు కార్పొరేటర్ అందజేశారు. అనంతరం జీవీఎంసీ ఆరిలోవ వీఎస్టీ స్కూల్ ఆవరణలో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని ఆమె సందర్శించారు. అక్కడ పిల్లలకు స్నాక్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సత్తి మందారెడ్డి, అర్జున్, రత్నం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు ప్రారంభం



జట్లను పరిచయం చేసుకుంటున్న సీపీ

విశాఖ స్పోర్ట్స్ : విశాఖ జిల్లా బాస్కెట్‌బాల్ బాలబాలికల జట్ల ఎంపిక పోటీలు శుక్రవారం పోలీస్ బ్యారెక్స్ గ్రౌండ్‌లో ప్రారంభమయ్యాయి. మూడురోజుల పాటు జరిగే ఈ పోటీల్లో బాలుర విభాగంలో 12 జట్లు, బాలికల విభాగంలో ఆరు జట్లు పాల్గొంటున్నాయి. ఈ పోటీల్లో సత్తాచాటిన బాలబాలికలను జిల్లా జట్లుగా ఎంపిక చేసి ఈనెల 29 నుంచి నూజివీడులో జరిగే అంతర్ జిల్లాల బాస్కెట్‌బాల్ పోటీలకు పంపనున్నారు. ఈ సందర్భంగా పోటీలను నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ వర్మ ప్రారంభించి జట్లను పరిచయం చేసుకున్నారు. అతిథిగా సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ హాజరు కాగా జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

విశేషంగా అప్పన్న నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30 నుంచి 10.30గంటల వరకు కల్యాణం కమనీయంగా నిర్వహించారు. మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.